# కురుమలకు రాజకీయ ప్రాధాన్యం

- సీఎం కేసీఆర్ కృషితో సంక్షేమ పథకాలు
- కురుమ సంఘ భవనానికి హైదరాబాద్ కోకాపేటలో రూ.వెయ్యి కోట్ల విలువైన భూమి
- పింఛన్ రాని మహిళలకు 'సౌభాగ్యలక్ష్మి'
- జనగామ బీరప్పగుడికి నిధులిస్తాం
- నియోజకవర్గ ఆత్మీయ సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



కురుమల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గొల్లకురుమలకు రాజకీయ ప్రాధాన్యం లభించిందని బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జనగామలోని సాయిరాం కన్వెన్షన్‌లో కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సేవెల్లి సంపత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం, మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు కర్రె శ్రీనివాస్, జూకంటి లక్ష్మి, పేర్ని స్వరూప, బాల్దె కమలమ్మ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జల్లి సిద్ధయ్య, మండల శ్రీరాములు, మేకల రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో హాజరైన కురుమలు కారు గుర్తుకే ఓటేసి గెలిపిస్తామని స్పష్టం చేస్తూ పల్లాకు మద్దతు తెలిపి ఘన స్వాగతం పలికి ఏకగ్రీవ తీర్మానం చేశారు. గొర్రె పిల్లను బహుకరించి సత్కరించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ భూమి ఉన్నా లేకున్నా పట్టణం సహా గ్రామాల్లో రైతు బీమా తరహాలో రూ.5 లక్షల కేసీఆర్ బీమా, తెల్లరేషన్ కార్డున్న వారు అనారోగ్యానికి గురైతే రూ.15 లక్షల వైద్య బీమా సదుపాయం కల్పిస్తూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించడాని గుర్తుచేశారు. జనగామలో బీరప్ప ఆలయాల నిర్మాణం, మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లో కురుమ సంఘాలకు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని చెప్పారు. జనగామ నియోజకవర్గాన్ని శాసించే సంఖ్యలో ఇప్పటికే కురుమలు కౌన్సిలర్లుగా, ముఖ్యమైన పదవుల్లో ఉన్నారని తెలిపారు. కొమురవెల్లి ఆలయ చైర్మన్ పదవి సహ కార్పొరేషన్ పదవులు, చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించే స్థానాల అంశాన్ని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కురుమల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని, తనను ఆదరించి దీవిస్తే తప్పకుండా మీరు కోరిన వన్నీ చేసిపెడుతానని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గొల్ల, కురుమలకు గొర్రెలు పంపిణీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కోకాపేటలో కురుమ భవనానికి రూ.500 కోట్ల విలువైన 500 గజాల భూమి ఇచ్చి నిధులు కేటాయించారని తెలిపారు. కురుమల కోసం గొర్రెల పంపిణీతో ఆయా కుటుంబాల్లో ఆర్థిక పరిపుష్టి కలుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కుల వృత్తులకు జీవం పోసి ఆయా వర్గాల ప్రజల ఆర్థిక పరిపుష్టి పెంచడంతోపాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని అన్నారు. గొల్ల, కురుమలకు బ్రహ్మాండమైన పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం రూ.11 వేల కోట్లతో రెండు విడుతలుగా గొర్రెలను పంపిణీ చేసిందని పల్లా వివరించారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కురుమలకు మంచి నాయకత్వం ఉందని, సీఎం కేసీఆర్ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందచేస్తున్నారని అన్నారు.

**పల్లా అభ్యర్థి కావడం జనగామ ప్రజల అదృష్టం**
**-ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం**

బీఆర్ఎస్ అభ్యర్థి పల్లాకు మద్దతు ఇద్దాం.. కురుమలంతా ఐక్యంగా ఆయన గెలుపు కోసం తీర్మానం చేశామని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. రాజేశ్వర్‌రెడ్డిని స్వయంగా సీఎం కేసీఆర్ జనగామకు పంపించారని, ఆయన అభ్యర్థి కావడం జనగామ నియోజకవర్గ ప్రజల అదృష్టం అని అన్నారు. ఎమ్మెల్యే అయితే రాష్ట్రంలో జనగామకు ప్రత్యేక గుర్తింపు వస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన కురుమలందరిని పల్లా కంటికి రెప్పలా కాపాడుకుంటారని, సీఎం కేసీఆర్ మనసున్న మారాజు..నిండు అసెంబ్లీలోనూ యాదవుల గొప్పతనం గురించి గొప్పగా మాట్లాడారని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కురుమలకు ఎమ్మెల్సీ ఇచ్చిన గౌరవించిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. పల్లా విజయం కోసం అందరూ కృషి చేసి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు చిన్నం నర్సింహులు, జూకంటి శ్రీశైలం, బాల్దె సోమయ్య, కర్రె కృష్ణ, నాగులపల్లి శ్రీశైలం, కేమిడి ఉపేందర్, దామెర మల్లికాంబ, జూకంటి తిరుపతి, మేకల సంతోష్, బండ వెంకటేశం, పర్వతాలు, సేవెల్లి మధు, దేవునూరి సతీశ్, జాయ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

## దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని పెంచిన సీఎం కేసీఆర్

- దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో ఆసరా పింఛన్లు
- బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి
- ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కే వాసుదేవరెడ్డి

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 5 : ఉమ్మడి రాష్ట్రంలో దివ్యాంగులను నాటి పాలకులు విస్మరిస్తే పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ వారికి భరోసా అందించి ఆసరా పింఛన్లను రూ.4016కు పెంచారని బీఆర్ఎస్ స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల ఆత్మీయ సమావేశానికి వడగం అంజేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించారని తెలిపారు. సమైక్య పాలనలో దివ్యాంగులకు పెన్షన్‌గా రూ. 500 ఇస్తే, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూ.వెయ్యి నుంచి రూ.4016కు పెంచారని గుర్తు శ్రీహరి చేశారు. దీనిని ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.

**ఉగాది నుంచి దివ్యాంగులకు రూ. 5016 పెన్షన్**

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే వచ్చే ఉగాది నుంచి దివ్యాంగుల పింఛన్‌ను రూ. 5016 పెంచేందుకు సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటారని, ఇందుకనుగుణంగా ఎన్నికల మ్యానిఫెస్టో రూపొందించారని కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో రూ.1100, రాజస్థాన్‌లో రూ.1500 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో రూ. 1000 మాత్రమే ఇస్తున్నారని వివరించారు. ఎన్నికలు రావడంతో ప్రజలకు మాయమాటలు చెప్పేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రచారానికి వస్తున్నందున వారిని నిలదీయడంతోపాటు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. ఎన్నికల్లో తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గంలో కోటి రూపాయలతో దివ్యాంగులకు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని కడియం శ్రీహరి హామీ ఇచ్చారు.

**కడియంను భారీ మెజార్టీతో గెలిపించాలి : వాసుదేవరెడ్డి**

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా కడియం శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. ఎన్నికలు రావడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ పాలనలో దేశంలో ఎక్కడాలేని విధంగా దివ్యాంగులకు రూ.4016 పెన్షన్ ఇస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 5,763 మంది దివ్యాంగులున్నారని, మీరంతా కుటుంబ సభ్యులు, బంధువులతో కడియం శ్రీహరికి 20 వేల ఓట్లు పడేలా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్ బాబు, దివ్యాంగుల సంఘం నాయకులు ఎండీ మున్నా, దామెర రమేశ్, దీకొండ నరేశ్, వీ యాదగిరి, గంటా లక్ష్మి, ఎస్ సమ్మయ్య, బీ కుమారస్వామి, డీ మంగ, కే లక్ష్మణ్, ఎం వీరస్వామి, ఆర్ సత్యనారాయణ, కడియం యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్మకంటి నాగరాజు, సభ్యులు ఇల్లందుల విజయ్, సంపత్ రాజు, జేడీ ప్రసాద్, యాట అశోక్ పాల్గొన్నారు.




ఆత్మీయ సమావేశానికి హాజరైన దివ్యాంగులు

## ఎల్లలు దాటిన జానపద కళారూపాలు

**జైపూర్‌లో మాణిక్యపురం ఒగ్గు కళాకారుల ప్రదర్శన**

లింగాలఘనపురం, నవంబర్ 5 : మండలంలోని మాణిక్యపురానికి చెందిన ఒగ్గు కళాకారులు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో అబ్బురపరిచేలా కళాప్రదర్శనలిచ్చారు. లోక్‌రంగ్ 26వ జాతీయ నృత్య మహోత్సవాలు జైపూర్‌లోని సవహార్ కళాకేంద్రంలో గత నెల 29 నుంచి ఈ నెల 8 వరకు నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషాసాంస్కృతిక శాఖ ప్రతిపాదన మేరకు మాణిక్యపురం ఒగ్గు కళాకారులకు అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఒగ్గు కళాకారులు జానపద కళల్లో ప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీత ఒగ్గు రవి నేతృత్వంలో ఒగ్గుడోలు, ఘటవిన్యాసాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఒగ్గు రవి మాట్లాడుతూ తెలంగాణ జానపద కళారూపాలను దేశ ప్రజలంతా ఆదరిస్తున్నారని తెలిపారు. తమకు అరుదైన అవకాశాన్ని కల్పించిన భాషాసాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



జైపూర్‌లో ప్రదర్శన ఇస్తున్న ఒగ్గు కళాకారులు



కడవెండిలోని నల్ల నర్సింహులు స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## నల్ల నర్సింహులు జీవితం ఆదర్శనీయం

దేవరుప్పుల, నవంబర్ 5: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు నల్ల నర్సింహులు పేదల హక్కుల కోసం ప్రజాఉద్యమాలు నడిపిన యోధుడని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అన్నారు. నల్ల నర్సింహులు 30వ వర్ధంతి సందర్భంగా మండలంలోని కడవెండిలోని స్మారక స్తూపం వద్ద ఆదివారం ఘన నివాళులర్పించారు. అనంతరం దయాకర్ మాట్లాడుతూ నర్సింహులు అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి ఫలితాలు సాధించిన ఘనుడన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల నర్సింహులు కూతురు అరుణ, స్థానిక సర్పంచ్ పోతిరెడ్డి బెత్తినారెడ్డి, ఎంపీటీసీ దుబ్బాక కవిత, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నక్క రమేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తాటిపల్లి మహేశ్, మండల నాయకులు హనుమంతు, ఏల సుందర్, ఉపసర్పంచ్ నాగేశ్, మండల కోఆప్షన్ సభ్యుడు మజార్, కాశబోయిన మల్లేష్, పడమటింటి కొంరయ్య, దొడ్డి భిక్షపతి, రాజ్‌కుమార్, సులుగురి మహేశ్, ధరగాని రాములు, గుమ్మడవెల్లి సోమేశ్, అశోక్, కుమార్,కృష్ణ, వీరస్వామి పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్త తనిఖీల్లో రూ.2 కోట్ల 98 లక్షలు సీజ్

జనగామ చౌరస్తా, నవంబర్ 5 : శాసనసభ ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లో భాగంగా జిల్లాలో అక్రమ నగదు, మద్యం రవాణాపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రూ.2, 98,97,729, 5522.31 గ్రాముల బంగారం, 770 గ్రాముల వెండి, అక్రమంగా నిల్వ చేసిన మద్యం 46697.57 లీటర్లతో పాటు 685 బెల్ట్ షాపులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాపర్టీలో రాసిన ఎన్నికల ప్రచార వాల్‌రైటింగ్, పోస్టర్లకు సంబంధించి 9603 కేసులు, ప్రైవేట్ ప్రాపర్టీలో 13439 కేసులు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 291 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.